# ఆమనికోయిల

— ఎస్. చంద్రావళీ సుదర్శన్

వసంత కాళ్ళీడ్చుకుంటూ యింట్లోకి రాగానే, ప్రమీల చక్కగా మేకప్ అయి ఎదురొచ్చింది.

చక్కటి షిఫాన్ చీరలో అందంగా వున్న చెల్లెలివైపు దీర్ఘంగా చూసింది వసంత, ఎక్కడికన్నట్లు.

"మా ఫ్రెండ్స్, లలితా, రాణీ, నేనూ సినిమాకు వెళుతున్నాం అక్కా! వంట చేయలేదు. అమ్మ గుడికెళ్ళింది. వచ్చాక చేస్తుందిలే, నువ్వేం హైరానా పడకు!"

హడావిడిగా చెప్పేసి వెళ్ళిపోయింది ప్రమీల.

చేతిలో వున్న పుస్తకాలు, టిఫెన్ బాక్సు, హాండ్ బ్యాగ్ టేబిల్‌మీద పడేసి ఉస్సూరంటూ కుర్చీలో కూలబడింది వసంత. రోజూ త్వరగానే వచ్చేదే, కానీ ఈ వేళ హెడ్ మిస్ట్రెస్ మీటింగు పెట్టుకోవటంతో ఆలస్యం అయింది. పొద్దున్నెప్పుడో తిన్న భోజనం అరిగిపోయి కడుపులో ఆకలి కరకరమంటోంది. మధ్యాహ్నం టిఫిన్ తీసుకెళ్ళింది గానీ, తెరచి చూస్తే యిడ్లీ పుల్లటి వాసన కొడుతుంటే వాటిని కుక్కకు వేసేసింది.



తల నొప్పితో తల పగిలిపోతుందా అనిపిస్తోంది వసంతకు. లేచి లోపలకు వెళ్ళింది. ఎక్కడా కాఫీ చేసిన జాడలేదు. లేక చేసుకొని తాగే సారేమో తెలీదు. తిరిగి వచ్చి ముందర గదిలో కూలబడింది వసంత. ఇంకా పాలు రావడానికి చాలా ఆలస్యం వున్నది.

కణతలు నొక్కుకుంటూ వుంటే తండ్రి రంగనాథం గబగబా లోపలకు వచ్చారు.

"వచ్చావా అమ్మాయి, ఇంతకు ముందు వస్తే నువ్వు లేవు. ఓ అయిదు రూపాయలుంటే యిస్తావ్! అర్జంటు పనుంది."

తండ్రివైపు జాలిగా చూసింది వసంత.

ఏదో అనబోయి, మారుమాట్లాడకుండా టేబుల్ మీద వున్న హాండ్ బాగ్‌లో నుండి అయిదు రూపాయలు తీసి యిచ్చేసింది.

వచ్చినంత హడావిడిగా వెళ్ళిపోయాడు రంగనాథం.

తండ్రి కుండే ఆ అర్జెంట్ పనేమిటో బాగా తెలుసు వసంతకి. బ్రాకెట్లాడటం!

కూతురు డబ్బుతో బ్రాకెట్లాడే తండ్రి బలహీనతని అసహ్యించుకోదు వసంత. జాలి పడుతుంది అంతే.

దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం ఉద్యోగం పోయినప్పటి నుంచీ బ్రాకెట్లాడి తన కుటుంబాన్ని ఏదో ఉద్ధరించాలనే ప్రయత్నిస్తూ తనని తాను మరింత పతనం చేసుకొంటున్నాడు ఆయన.

పాలు రావడంతో వసంత ఈ లోకంలోకి వచ్చింది. గబగబా కాఫీ చేసుకొని త్రాగి వంట ప్రయత్నంలో పడింది.

వంటంతా పూర్తయ్యేసరికి తల్లి వచ్చింది.

"నా తల్లి బంగారు తల్లి! వంటంతా చేసేశావా అమ్మా! అదుగో దారిలో రామయ్యమ్మ కనబడితేనూ...."

ఇక ఆ తరువాత తల్లి చెప్పేది వినలేదు వసంత. తల్లి చెప్పే గాలికబుర్లు వినాలనే ఆసక్తి వసంతలో ఏ మాత్రమూ లేదు.

*

వసంత కుటుంబాలు మధ్య తరగతి కుటుంబాల్లాంటిదే వసంత కుటుంబం కూడా! తండ్రి రంగనాధంకు లంచం తీసుకోవటంతో ఉద్యోగం పోయింది.

పిల్లలేమో ఆరుగురు! పెద్ద కొడుకు హైదరాబాదులో అతి ప్రయత్నం మీద ఉద్యోగం సంపాయించుకున్నాడు. వివాహం కూడా అయింది. వచ్చే జీతం అతనికే సరిపోదు. ఇక తండ్రికేం పెడతాడు? ఇక రెండవ కొడుకేమో ఎమ్. ఎ. చేసి గోళ్ళు గిల్లుకొంటున్నాడు. ఉద్యోగం లేక! అందరికంటే పెద్దదయిన వసంత అక్క రాజ్యలక్ష్మికి పదహారేళ్ళకే వివాహం చేశారు. వరుడు వసంత వాళ్ళమ్మ బంధువర్గంలోని వాడే. ఉద్యోగం లేదు. వ్యవసాయం చేసుకుంటాడు. వాళ్ళు వుండేది పల్లెలో.

ఈ పరిస్థితుల్లో వసంత బి. యి. డీ పూర్తి చేసింది. అదృష్టవశాత్తూ తెలిసిన వారిద్వారా వున్న వూర్లోనే ఉద్యోగం వచ్చింది టీచర్‌గా. ఆ సంవత్సరమే ఇంటర్ చదివిన తమ్ముడు రవి ఇంజనీరింగులో చేరుతానంటే కాదనలేదు వసంత. ఎందుకంటే తమ్ముడు తెలివైన వాడు. అభివృద్ధిలోనికి రానీ అనుకుంది. ఇక చెల్లెలు ప్రమీలేమో తొమ్మిదవ తరగతిలో వుంది.

వసంత ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకు రెండవ అన్నకు వివాహం జరిగింది. పిల్లనిచ్చే వాళ్ళు కట్నం యివ్వకుండా, ఆ డబ్బుతో ఓ ప్రవేటు కాలేజీలో డొనేషన్ కట్టి లెక్చరర్‌గా ఉద్యోగం యిప్పించారు. అతనికి ఉద్యోగం ఒంగోలు దగ్గర. అలా వసంతకు ఆ అన్నయ బాధ్యత తెగిపోయింది.

తమ్ముడు బి. టెక్. అవగానే భిలాయ్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. వెంటనే అతనికి సంబంధాలు వచ్చాయి. తన పెళ్ళికోసం రవిని ఆగమనలేదు వసంత. అతని వివాహం చేసేయ్యమంది. అతని కొచ్చే కట్నంతో ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలని ఆమె తల్లి తహతహలాడింది. కానీ కుదరలేదు.

రవి మంచివాడే! వచ్చిన కట్నం వచ్చినట్లుగా ఇరవై వేలు యింట్లో యిచ్చాడు. ఐదు వేలు తనకూ పెళ్ళికూతురికి బట్టలు కొనుక్కొవడానికి ఉంచుకున్నాడు.



ఎస్. వి. ఎస్. ఎల్.
రంగనాయకమ్మ

కాకినాడ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలుగాను ఇతర సేవాసంస్థలలో వివిధ పదవులను నిర్వహించిన శ్రీమతి రంగనాయకమ్మ ప్రముఖ సంఘ సేవికురాలు. భర్త శ్రీ ఎస్. ఎస్. ఎన్. మూర్తి ప్రోత్సాహంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల కొరకు ఒక ఎయిర్‌కండిషన్ గదిని తయారు చేయించి ఇచ్చారామె. శ్రీమతి రంగనాయకమ్మకు నాటకరంగంలోనూ ప్రవేశం వున్నది.

—విజయవాడ విలేకరి

ఇంట్లో ఇరవై వేలు చూసేసరికి అందరికి ఖర్చులు గుర్తొచ్చాయి. 'మరిది పెళ్ళికి మాకు కనీసం పట్టుచీరన్నా పెట్టడా?' అన్నారు వదినలు. అక్కకీ, తల్లికీ, వదినలకీ అందరికీ పట్టుచీరలు, పిల్లలకు మంచి గుడ్డలూ వచ్చాయి. ఇంటి మీద ఉన్న కొద్ది అప్పు తీరింది. మిగతా డబ్బు పెళ్ళి ఖర్చులకూ, చార్జీలకూ సరిపోయింది.

మిగిలిన డబ్బుతో పెళ్ళికూతురికో చిన్న గొలుసు చేయించారు. వసంత ఒక్కతే ఏమీ కొనుక్కోనిది!

"నాకేం వద్దమ్మా!" అంది తల్లితో.

"నా తల్లి బంగారు తల్లి!" అంది వాళ్ళమ్మ!

*

ఈ సంవత్సరంలో వసంత కుటుంబంలో చిన్న మార్పు సంభవించింది. అదేమంటే గత రెండేళ్ళుగా బి. కామ్. చదివి వూరికే కూర్చున్న ప్రమీలకు బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. ఇంటిల్లిపాదికీ ఆనందం కలిగించిందీ వార్త! కానీ పోస్టింగ్స్ రాజమండ్రికి యిచ్చారు. "అంత దూరమే," అంది తల్లి!

వసంతే తల్లిని, చెల్లిని, తండ్రినీ ప్రోత్సహించి పంపేసింది. కొన్నాళ్ళు ప్రమీల దగ్గర తల్లి వుంటే, మరి కొన్నాళ్ళు తండ్రిని పంపేదీ, ఇలా జరిగింది ఆర్నెల్లబట్టీ.

ఆర్నెల్ల నుంచీ చెల్లెలు ఒకపైసా పంపక పోయినా, తల్లి యిక్కడి నుండే పప్పులూ, ఊరగాయలూ, పొళ్ళూ పంపుతున్నా ఏమీ అనేది కాదు వసంత!

"నా తల్లి వసంత బంగారు తల్లి! దానిది దొడ్డ బుద్ధి!"

ఊరంతా చెప్పేది తల్లి.

ఆర్నెల్ల తరువాత వారం రోజులు సెలవుపెట్టి వచ్చింది ప్రమీల తల్లితో! వచ్చినప్పటి నుండీ ఊరంతా చుడుతున్నారు వాళ్ళిద్దరూ! వసంత కెప్పుడూ ఒకరింటికీ, ఊర్లకు వెళ్ళే అలవాటు లేదు. తల్లీ, చెల్లెలు స్నేహితుల యిళ్ళకీ, సినిమాలకూ తిరుగుతున్నారు. చెల్లెలి మెడలో సన్నని గొలుసూ, చెవుల్లో రింగులూ చూసింది వసంత. తెలివిగల పిల్ల అనుకుంది. వసంతకు మాత్రం ఎక్కడికీవెళ్ళే తీరుబాటూలేదు. ఎప్పుడూస్కూలూ, ట్యూషన్సూ, సెలవుల్లో ఎక్కడి కెళదామన్నా కుదరదు.

వసంత అక్క రాజ్యలక్ష్మి చదువుకోలేదు కాబట్టి ఆమెకు పిల్లలు బాగా చదువుకోవాలని ఆకాంక్ష! సెలవులు వస్తే చాలు పిల్లల్ని తరిమేది వసంత దగ్గరకి! వాళ్ళకి చదువు చెప్పాలంటే చాలు తలప్రాణం తోకకు వచ్చేది వసంతకి! రెండో అన్న, వదినా అప్పుడప్పుడు వచ్చేవాళ్లు-ఒక్కొక్క



150

సారి అంతా కలిసి హైదరాబాదు వెళ్ళేవాళ్ళు పిల్లల్ని వదిలేసి.

"పాపం, వాడిది చిన్న జీతం! ఇంతమందిమీ ఉత్తచేతుల్తో వెళితే ఎలా?" అనేది తల్లి! పెద్ద కొడుకుని తలచుకొని.

అంతా కలిసి తినుబండారాలు, వగైరాలు చేసుకొని హాయిగా వెళ్ళేవారు. చేతి ఖర్చులకు, ఛార్జీలకు డబ్బు యిచ్చేది వసంత. ఇంట్లో ఉన్న తండ్రినీ, అన్న పిల్లల్నీ, అక్క పిల్లల్ని చూసుకొంటూ ఉండిపోయేది వసంత!

"నా తల్లి వసంత బంగారు తల్లిగా! నేనుంటాలే అమ్మా! నువ్వెళ్ళిరా అంది!" మురిపెంగా చెప్పేది తల్లి, పెద్దకొడుకుతో. అతను నవ్వేవాడు.

*

రాత్రి ఎనిమిది గంటలయింది. వసంతా, తల్లీ భోంచేశారు. ప్రమీలా, తండ్రి రంగనాధం యింకా రాలేదు.

వరండాలో కూర్చుని వసంత ట్యూషన్ పిల్లలకు పాఠాలు చెబుతోంది. బయట రిక్షా ఆగిన చప్పుడయితే తొంగి చూసింది వసంత. రెండో అన్నయ్యా, వదినా పిల్లలతో దిగుతున్నారు.

"రండి ఇదేనా రావటం, పొద్దుపోయిందే!" అంది వసంత.

"పొద్దు ఉండగానే వచ్చాం మరదలా! నీ పని మీదే ఆలస్యం అయింది!" అంది వదిన.

"నా పనిమీదా? అర్థం కాలేదు వసంతకి."

ముసి ముసిగా నవ్వింది వదిన.

ఇంతలో తల్లి వచ్చి, ఆనందంగా కొడుకూ కోడలిని యింట్లోకి తీసుకు వెళ్ళింది.

అన్నా వదినా కాళ్ళూ ముఖాలు కడుక్కొని భోజనాలకు ఉపక్రమించడం జరిగింది.

వసంత అప్పటికి ట్యూషన్ పిల్లలని పంపేసి మధ్యహాల్లో మంచం మీద పడుకుంది.

లోపల వంటగదిలో నుండి అన్నా వదినల మాటలు వినవస్తున్నాయి.

"అబ్బాయికి హైదరాబాదులో బ్యాంకులో ఉద్యోగమత్తయ్యా! బాధ్యతలన్నీ తెంచుకున్నాడు. అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. కష్టం, సుఖం తెలిసినవాడు కాబట్టి, కట్నం వద్దనీ, ఉద్యోగం చేసే పిల్ల కావాలనీ అంటున్నాడట. మా అమ్మకు పినతల్లి కొడుకు! నే చెప్పానంటే యిక కాదనడనుకో!"

వదిన మాటలకు తల్లి మురిసిపోవడం వినిపించింది. "నా తల్లే అదో గట్టున పడిందంటే యిక దిగులేముంది?" అంటోంది తల్లి.

"మాకూ అదేకదా అత్తయ్యా కావలసింది!"

ఆరిందాలా అంటోంది వదిన.

మనసులోనే నవ్వుకుంది వసంత.

*

ఉదయం పదిగంటల వేళ, పెళ్ళివారొచ్చారు. వసంత వాళ్ళింటికి!

వాళ్ళు క్రితం రాత్రే వచ్చి హోటల్లో వున్నారు, కతికితే అతకదని. వాళ్ళకి కావలసిన ఏర్పాట్లు చూసి వసంత అన్నా వదినా సాయంత్రం ఆలస్యంగా వచ్చారు.



కె. రాధామాధవి

విజయనగరం లక్ష్మీగణపతి కోవెల ఆధ్వర్యాన జరిగి ఉత్సవాలలో నాట్యంచేసి పలువురి మన్ననలు పొందిన రాధామాధవి.

వసంత ఆ వేళ స్కూలుకు సెలవు పెట్టింది. గదిలో పెళ్ళిచూపులకు రెడీ అవుతోంది. తల్లి పట్టుచీర కట్టుకోమంది. వదిన, చెల్లీ వద్దని చక్కని అమెరికన్ జార్జెట్ చీర కట్టించారు. వీళ్ళు పక్కగదిలో అలంకరింస్తుండగానే బయట వాళ్ళొచ్చిన అలికిడి అయింది. వసంత వదిన రివ్వుమని పరిగెత్తింది. కుశల ప్రశ్నలూ, పరిచయాలూ అయ్యాయి. వసంత వదిన అత్తగారికి బంధువులనీ పరిచయం చేసింది.

టిఫెన్లూ, కాఫీలూ అయ్యాక పిలిచారు వసంతని. వసంత చాలా మామూలుగా వెళ్ళి కూర్చుంది. పెళ్ళికొడుకు శేఖర్ వెంబడి పినతల్లీ, బాబాయ్, మేనమామ వచ్చారు. శేఖర్ పినతల్లి అడ్డదిడ్డంగా ఏవో ప్రశ్నలు వేసింది. వసంత వాటికన్నిటికీ ఓపిగ్గా సమాధానం చెప్పింది.

మేనమామ శేఖర్‌ని హెచ్చరించారు, ఏదైనా అడగమని 'వివరాలన్నీ తెలుసుకదా మామయ్యా! మళ్ళీ ఎందుకు!' అనేసి తప్పించుకున్నాడు శేఖర్.

వసంత వాళ్ళమ్మ వసంత గుణగణాలన్నీ ఏకధాటిగా ఏకరువు పెడుతూ, తన కూతురు 'ఎంత బంగారు తల్లో' వివరిస్తోంది.

ఈ మధ్యలో కలగజేసుకుంది శేఖర్ పినతల్లి.

"ఇంకో అమ్మాయికి బ్యాంకులో ఉద్యోగం అన్నారుగా! ఆ అమ్మాయినీ పిలవండి, పూరికే చూస్తాం. వూరునుండి వచ్చిందని చెప్పారుగా!" అందావిడ లౌక్యంగా.

అంతా తెల్లబోయారు.

"ఈ అమ్మాయి తమ్ముడికి పెళ్ళి అయిందంటున్నారు నిరుడేగా! తమ్ముడికే అయినప్పుడు చెల్లెలికి చేస్తే తప్పేముంది. అయినా కళ్యాణరేఖ ఎవరికి తోసుకొస్తే వారికి ముందవుతుంది లేండి!"

ఈ సారి మేమమామ అందుకున్నాడు.

అందరిలోకి ముందుగా వసంతే తేరుకుంది.

"ప్రమీలా! ఓసారిలారా!"

తల వెనక్కి తిప్పి పిలిచింది.

మెల్లిగా కర్టెన్ తోసుకొని వచ్చింది ప్రమీల.

చెల్లి ప్రమీల, బి. కామ్." అంది వసంత.

ప్రమీలని నిశితంగా చూశారు పెళ్ళివారంతా. లోపలికి వెళ్ళబోతున్న ప్రమీలని ఆపి మరో రెండు ప్రశ్నలు వేసింది శేఖర్ పినతల్లి!

తరువాత వసంతా, ప్రమీలా యిద్దరూ లోపలికెళ్ళిపోయారు. తల్లీ వదినా కూడా లోపలికొచ్చారు.

"వాళ్ళు చూడబోతే ప్రమీలను చేసుకుంటారేమో!" అంది వదిన.

"అక్కయ్యను చూడ్డానికొచ్చి నన్ను చేసుకోవటమేమిటి?" చిరాగ్గా అంది ప్రమీల.

"ఎవరో ఒకరికి కట్నం లేకుండా కుదరటం అదృష్టం కాదూ!" అంది తల్లి.

వసంత ఒక్కత్తే మౌనంగా వుండిపోయింది.

బయట గుసగుసలు జరుగుతూనే ఉన్నాయి.

పావుగంట తరువాత అన్నయ్య హడావిడిగా లోపలికి వచ్చాడు. వచ్చినంత వేగంగానూ

చెప్పాడు.

"వాళ్ళు మన సంబంధానికి ఒప్పుకొన్నారమ్మా! అయితే ప్రమీలని చేసుకుంటారట. ఆ అబ్బాయికి బాంక్ వుద్యోగం కాబట్టి ప్రయత్నిస్తే రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ అవుతుందట. కానీ అదే వసంత అయితే ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటం కష్టం! ఇద్దరూ అక్కడో చోట యిక్కడో చోట వుండటంతో ఏం మిగులుతుంది? అంటున్నాడతను పైగా వసంత వయసూ అతని వయసూ ఒకటే, ప్రమీలయితే చిన్నది కదా, సరిపోతుంది. ఏమంటారు?"

అందరి వైపూ ముఖ్యంగా వసంత వైపు చూశాడు వసంత అన్న, ఆలోచనగా.

ప్రమీల ఏదో చెప్పబోయింది. మధ్యలోనే వారించింది వసంత.

"నువ్వుండు ప్రమీ! అన్నయ్యా ఈ సంబంధం ప్రమీలకు ఖాయం చేసేయ్! కాని కట్నం లేకుండా యింత మంచి సంబంధం మళ్ళీ దొరకదు. అతనికి ఏ బాదరబందీ లేదు. నా కోసం ప్రమీల పెళ్ళెందుకు ఆగిపోవాలి! తన కోసం అమ్మా నాన్న అటూ ఇటూ తిరుగుతూ వుండడమే సరిపోతుంది!"

"అదికాదు అక్కయ్యా! ఇప్పుడే నాకు పెళ్ళెందుకు?" నసిగింది ప్రమీల.

"ఇప్పుడు కాకపోతే యింకెప్పుడు? వయసు ముదిరిందని అనిపించుకునే వరకూ ఆగటం ఎందుకు?" హెచ్చరించింది వసంత.

ప్రమీల మరి మాట్లాడలేదు.

ప్రమీల మౌనం అంగీకారంగా తీసుకొని, వసంత అన్నయ్య అన్నాడు యిలా.

"దూరాభారం కాబట్టి మళ్ళీ మళ్ళీ రావటానికి కుదరదట వాళ్ళకి. పసుపూ కుంకుమ యిచ్చి నిశ్చయం చేసుకొంటారట. నేను వెళ్ళి పురోహితుణ్ణి పిలుచుకొని వస్తాను. మీరు యింట్లో ఏదో ఒకటి వండే ఏర్పాట్లు చూడండి."

వెళ్ళబోయాడు వసంత అన్నయ్య.

"ఆగు అన్నయ్యా నేనూ వస్తాను. ఎలాగూ ఈ వేళ లీవ్ పెట్టేశాను కదా. అలా బజార్లోకి వెళ్ళి ఓ పట్టుచీర తీసుకొస్తా ప్రమీలకి," అంది వసంత.

"నా తల్లి వసంత బంగారు తల్లి!" అంది వసంత అమ్మ.

నిజమే! వసంత ఎప్పుడూ అమనికోయిలే!! □

# వంటలు





## క్యాబేజీ ఖీర్

**కావలసిన పదార్థాలు :** 250 గ్రా॥ క్యాబేజీ; 400 గ్రా॥ పంచదార; $\frac{1}{2}$ లీటరు కాచిన చిక్కటి పాలు; 2 టీ స్పూన్లు నెయ్యి; 5 ఏలకులు; 10 గ్రా॥ జీడిపప్పులు; చిటికెడు కేసరి పౌడరు.

**తయారు చేసే విధానం :** క్యాబేజిని సన్నగా తరుక్కోవాలి. $\frac{1}{4}$ లీటరు నీళ్ళు వేసి గిన్నెలో గాని కుక్కర్‌లో గాని మెత్తగా వుడకబెట్టాలి. వుడికిన తరువాత వడబోసి ఆ నీటిని వేరుగా వుంచాలి. క్యాబేజి చల్లారిన తరువాత గట్టిగా పిండుకొని మిక్సీలో గాని రోట్లో గాని వేసి మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బిన ముద్దను $\frac{3}{4}$ గ్లాసు నీళ్ళలో వేసి పైన చెప్పిన పంచదార కలిపి స్టౌవ్ మీద సన్నపు సెగలో కలియబెడుతూ చక్కెర కరిగిన తరువాత 10 నిమిషాలు వుంచి దించి, కేసరి పౌడరు కలపాలి. దించినాక ఆవిరి తగ్గాక పైన చెప్పిన పాలు కలపాలి. జీడిపప్పు సన్నగా తరిగి నేతిలో వేయించి కలపాలి. ఏలకులు మెత్తగా నూరి కలపాలి. ఇప్పుడు ఖీర్ తయారు అవుతుంది. ఎప్పటిలా కాకుండా పండగల్లో ఈ ఖీర్ చేసుకుంటే కొత్త వెరైటీగా వుంటుంది. వడబోసిన నీటిని చారు పెట్టుకొంటే బాగుంటుంది. తక్కువ ఖర్చు కూడా.

—జి. లక్ష్మీసత్యా, పీలేరు



## క్యాబేజీ పుట్టు

**కావలసిన పదార్థాలు :** 250 గ్రా॥ క్యాబేజీ; 200 గ్రా॥ పచ్చిశనగపప్పు; 60 గ్రా॥ నూనె; 12 పచ్చిమిరపకాయలు; 4 ఉల్లిపాయలు; 1 వెల్లుల్లి (చిన్న సైజు); 1 స్పూను పసుపు పొడి; చిన్న అల్లం ముక్క; 1 స్పూను ఆవాలు; కొత్తిమిర, కరివేపాకు, ఉప్పు తగినంత.

**తయారు చేసే విధానం :** ముందుగా పప్పుని నీళ్ళలో 1 గంటసేపు నానబెట్టాలి. క్యాబేజీ తరుక్కొని నీళ్ళల్లో కడిగి, నీరు ఓడ్చి తీసి అందులో కొద్దిగా ఉప్పు కలిపి ఐదు నిముషాలు ఉడకబెట్టాలి. ఇప్పుడు పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి-ఈ మూడు కలిపి రుబ్బి విడిగా అట్టే పెట్టుకోవాలి. తరువాత పప్పు నీళ్ళు లేకుండా తీసుకుని అందులోను కొద్దిగా ఉప్పు కలిపి కచాప బాగా రుబ్బుకోవాలి. మెత్తగా రుబ్బకూడదు.

ఇప్పుడు బాణలిలో నూనె పోసి, నూనె కాగిన తర్వాత ఆవాలు వేసి, అవి చిటపటలాడుతూండగానే ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఉల్లిపాయ ముక్కలు నూనెలో వేగిన తర్వాత అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, మిశ్రమం దానికి కలపాలి. రుబ్బిన పప్పుని నూనెలో వేసి 4 నిముషాల సేపు కలపాలి. తర్వాత క్యాబేజీ కూడా వేసి కలియదియ్యాలి. ఇవి బాగా కలిసిన తర్వాత కొత్తిమిరి, కరివేపాకు వేసి కలిపి దించాలి. ఇది విడిగా అల్పాహారంగాను బాగుంటుంది, వేడివేడి అన్నంలోకి ఆధరువుగాను రుచిగా వుంటుంది.

—ఏ. సభాపతి హంసవేణి, బెంగళూరు